

# ప్రేమ వేలి

చందు సాంబాబు

చిత్తుకాగితాల సంచిని భుజాన వేసుకుని నడుస్తున్నాడు నర్శింహ. ఆకలిగా వుంది.
పొద్దుట్నించి టీ కూడా తాగలేదు.

ఏలూరు కాలువగట్టు మీద కూర్చున్నాడు. ఎవరో కాల్చిపారేసిన సిగరెట్ పీకని రోడ్డు మీద నించి తెచ్చుకున్నాడు. దాన్ని వెలిగించుకోడానికి అగ్గిపెట్టె లేదు. బండరాళ్ల దగ్గర చాకలివాళ్లు బట్టలు ఉతుకుతున్నారు. కొందరు పిల్లలు నీళ్లలో ఒడ్డుకు దగ్గరగా ఈతలు కొడుతున్నారు.

నర్శింహ స్నానం చేసి పది రోజులపైనే అయింది. ఒంటిమీద గుడ్డలు తీస్తే వేరే గుడ్డలు లేవు. నెత్తిపైన ఎండ. సంచిని భుజాన వేసుకుని ఉసూరుమంటూ కదిలాడు.

కిళ్లీ దుకాణం దగ్గర లాంతరు స్తంభానికి చుట్టుకొని వెలుగుతోన్న తాడుతో సిగరెట్ పీకని వెలిగించుకున్నాడు. గట్టిగా దమ్ము పీల్చాడు. దాంతో కాస్త ఉత్సాహం పుట్టుకొచ్చింది. పక్కనే వున్న 'టీ' దుకాణం దగ్గర నించుని ఆశగా చూస్తున్నాడు. దుకాణం దగ్గర వున్నవాళ్లు వాడి వికృత ఆకారాన్ని చూసి ఇబ్బంది పడుతున్నారు. కొందరు అసహ్యించుకొంటున్నారు.

మరి కొందరు అస్సలు పట్టించుకోవడం లేదు.

పదిహేను నిమిషాల పాటు సంచిని భుజాన వేసుకుని శిఖండిలా నించున్నాడు నర్శింహ.

అదే ఏరియాలో కథల పుస్తకాలని అద్దెకిచ్చే లైబ్రరీ నడుపుతోన్న చంద్రన్న టీ తాగి సిగరెట్ వెలిగించి గాల్లోకి పొగని గుమ్ముగా వదులుతూ నర్శింహ కేసి చూశాడు. చంద్రన్నకి నర్శింహ తెలుసు.

''ఏరా నర్శింహా, టీ తాగుతావా?'' అడిగాడు. ఆ మాటకి నర్శింహ మొహం వెలిగిపోయింది.

''ఆకలిగా వుంది సారూ! తాగుతాను'' ఆశగా అడిగాడు నర్శింహ.

వాడికి టీ ఇప్పించాడు చంద్రన్న.

నర్సింహ ఆత్రంగా వేడిగా వున్న టీని ఊదు కొంటూ తాగుతుంటే చంద్రన్న మనసు కరిగి పోయింది. జేబులోంచి తీసి అయిదు రూపాయల బిళ్లని అందించాడు.

''టీ తాగితే ఆకలి పోతుందా! ఏదన్నా తిను'' అన్నాడు. ఆ చిల్లర డబ్బుల్తో ఇడ్లీ సాంబారు తినేస్తే ఆ రోజు గడిచి పోతుంది. ప్రాణం నిలుస్తుంది.

గాంధీనగర్ సెంటర్లోకి వచ్చి నించున్నాడు. అంతా ఖరీదైన వాతావరణం...

ఓ పక్క జనం, వాహనాలు.... కూడలి రద్దీగా వుంది. ఐలాపురం హోటల్ ముందు కొచ్చాడు. బయటకొచ్చే కార్లు, లోపలికి వెళ్లే కార్లు. చాలా హడావుడిగా వుంది. ఎలక్షన్లు దగ్గర పడ్డంతో ఊరంతా సందడిగానూ వుంది. ఏ పార్టీ గెలుస్తుందో! ఏ రాయి అయితేనేం పళ్లూడగొట్టుకోడానికి.

నర్సింహ హోటల్ కేసి చూస్తూ నిలబడ్డాడు. ఒక్క రోజు, ఒకే ఒక రోజు... ఎప్పుడైనా ఆ హోటల్లో బస చెయ్యాలి. అందులో చల్లని గదులుంటాయని ఓబులేసు చెప్పాడు. తాగడానికి మందు... తినడానికి ఏది పడితే అది దొరకుతుందట. కష్టపడి సంపాదించి ఒక్క రోజన్నా అలాంటి హోటల్లో గడపాలి. ఆ ఊహ మాత్రానికే వాడి మనసు ఎంతో ఉత్సాహంగా మారిపోయింది. అంతలోనే నవ్వుకున్నాడు. ఎన్ని చిత్తుకాగితాల సంచులు మోస్తే ఆ కోరిక తీరుతుంది. ఎక్కడలేని నీరసం ముంచుకొచ్చింది.

ఎండ ఎక్కువైంది. స్నానం చెయ్యాలనిపించింది. కాలువ గట్టు దగ్గరకి నడిచాడు. భుజాన వున్న సంచిని కిందపెట్టి కిందికి దిగాడు. అక్కడ కొట్టు కొచ్చిన పాత బట్ట కనిపించింది. దాన్ని చేతుల్లోకి తీసుకుని చూశాడు. బాగా చీకిపోయింది. ఒంటిమీద బట్టలు తీసి ఆ బట్టతో గోచీ పెట్టుకున్నాడు. నీళ్లలో దిగి తన బట్టల్ని నుసిమి గట్టున ఆరబెట్టాడు. బండ కేసి బాదితే ఆ బట్టలుండవు.

ఆ జాగ్రత్త తెలుసువాడికి.

ఎవరన్నా పాతబట్టలిస్తే బాగుండును.

నీళ్లలో దిగి మట్టితోనే ఒళ్లు రుద్దుకొని ఓ అరగంట పాటు స్నానం చేశాడు. బట్టలు ఆరేవరకు ఓ చెట్టు కింద కూర్చున్నాడు. స్నానం చేశాక ప్రాణం కాస్త తేలిక పడినట్లయింది.

ఎండిన బట్టల్ని వేసుకుని సంచినీ తలకింద పెట్టుకుని పడుకున్నాడు నర్సింహ.

***

ఆ రోజు సంపాదన మూడు రూపాయలు. కాళీ సంచిని బస్టాపు షెల్టర్ వెనక ఇనపకడ్డీల చాటున దాచి రామాటాకీసు దగ్గర ఇడ్లీ బండి దగ్గరకెళ్లి ఇడ్లీలు కొనుక్కుని సాంబారు పోయించుకుని తిన్నాడు. ఆకలి తీరింది. ప్రాణం కుదుట పడింది. అన్నం ఎలాగూ దొరకదు. ఆ ఇడ్లీలతోనే సరి పెట్టుకుంటాడు.

అక్కడా జనం. సినిమా జనం... విజయవాడలో సినిమాలకి కొదవుండదు. కానీ తనలాంటి వాడికి కనీసం నేల క్లాసులో కూర్చుని సినిమా చూసే అవకాశం లేదు. ఆ డబ్బులతో రెండు పూటలా తినచ్చు.

ఇలా ఎంతకాలం ఈ జీవితాన్ని ఈడవాలి?

తనెక్కడ పుట్టిందీ తెలీదు. తల్లీ, తండ్రీ ఎవరో తెలీదు. వయసు తెలీదు. పేరు లేదు. ఎవరో 'నర్సింహ' అని పిలిచారు. ఆ పేరు సొంతమైంది.

జనం.... అందమైన జంటలు... షాపింగ్ చేస్తున్న వాళ్లు. రోడ్డు పైన ఫాన్సీ వస్తువులు అమ్ముకొనే వాళ్లు. పూల దుకాణాలు. ఎవరూ కాళీగా లేరు. ఎవరి పనుల్లో వాళ్లు. అంతా హడావిడి.

నర్సింహ చూపు ఓ పాతికేళ్ల అమ్మాయిపైన పడింది. ఎంతో బాగుంది. కళ్లార్పకుండా ఆమె కేసి కాస్సేపు చూశాడు. కళ్లు చెదిరే అందం. భుజానికి అందమైన బ్యాగ్ తగిలించుకొని ఎత్తు మడమల చెప్పులు వేసుకుని ఒయ్యారంగా నడుస్తోంది.

ఆమె వెనక అడుగులు వేస్తున్నాడు నర్సింహ.

''అలాంటమ్మాయిని పెళ్లి చేసుకోవాలి!'' మనసులో కోరిక. అంతే! ఆమెతో ఓ ఖరీదైన కారులో బంగారు నగల దుకాణం ముందు దిగి ఓ నెక్లెస్ కొని ఆమె మెడలో అలంకరిస్తున్నట్లనిపించింది.

మనసులో కలిగిన ఆ కోరిక... వాడ్ని కొన్ని క్షణాలు ఆనందంలో ముంచెత్తి పడేసింది.

అన్నం ముట్టుకొని చూసి కొన్ని రోజులైంది. తింటే ఇడ్లీ సాంబారు. లేకపోతే పస్తు. ఇదీ తన జీవితం. కానీ తన మనసులో కోరికలకి అంతులేదు.

నిజానికి తన జీవితకాలంలో రెండు పూటలా అన్నం తినగలిగే స్థితి కలిగితే చాలు!

అసలిలాంటి జీవితం ఎందుకు? భూమికి భారం...

ఆశలున్నాయి. కోరికలున్నాయి. చదువు సంధ్య లేకపోయినా కష్టపడితే వృద్ధిలోకి రావచ్చంటారు!

ఇది తన బతుక్కి సాధ్యమేనా?

కష్టపడి పైకి రావాలంటే ఏం చెయ్యాలి? చిత్తు కాగితాలు ఏరుకోవడం తప్ప ఏదీ చేతకాదు. వాటిని తీసుకెళ్లి గుత్తేదారు కివ్వడం... అతనిచ్చిన చిల్లర తీసుకోవడం తెలుసు.

బ్యారేజీ మీద కెళ్లి కిందికి దూకి చచ్చిపోవాలి! అప్పుడన్నా మంచి జన్మ దొరుకుతుందేమో!

నవ్వుకున్నాడు నర్సింహ. అది పేరాశే!

రాత్రి పదవుతోంది. రోడ్డు మీద దొరికిన సిగరెట్ల పీకలని ఏరుకుని ఓ పీకని వెలిగించాడు. గాంధీనగర్లో రోజూ తను పడుకునే ఓ పాత పుస్తకాల షాపు దగ్గరకి నడిచాడు. షాపు ఇంకా కట్టేయలేదు.

సిగరెట్ పీకలని ఒరసగా కాలుస్తూ దూరంగా కూర్చున్నాడు నర్సింహ.

***

తెల్లవారురుఝామునే లేచి సంచి భుజానికి తగిలించుకొని బయలుదేరాడు. రోడ్డు మీద దొరికిన పాత కాగితాన్నల్లా ఏరి సంచిలో వేసుకుంటున్నాడు.

చెత్తకుండీలో చెత్త ఏరుతున్నాడు నర్సింహ. చేతికి గట్టిగా ఏదో తగిలింది. ఏదో రాయి అనుకున్నాడు. అంతలోనే చెత్తకుండీలో రాయి ఎవరేస్తారు? అనిపించింది. చేతులతో గబగబ కెలికాడు.

చిన్న బ్రీఫ్ కేసు. ఎవరో పడేసినట్లున్నారు? అందులో ఏముందో? బాంబు గానీ లేదు కదా! అలాంటి వస్తువులు కనబడితే పోలీసులకి చెప్పాలట.

పోలీసులంటేనే భయం వాడికి. ఓసారి దొంగతనం అంటగట్టి తీసుకెళ్లి చావగొట్టారు.

దొంగతనం చేతనవుతే ఈ చెత్త కాగితాలు ఏరుకొనే ఖర్మ దేనికి?

తెరిచి చూడాలి. బాంబైతే పేలుతుంది. చచ్చిపోతాడు. వెధవ బతుకు. పీడా పోతుంది. ఎవరికీ నష్టం లేదు. ఏడిచే వాళ్లు లేరు. కానీ అందులో ఏదన్నా దొరికితే? తన జాతకం మారిపోతుంది. అయిలాపురం హోటల్లో బస. పడవలాంటి కారు. అందమైన అమ్మాయితో పెళ్లి!

సూటులో తను. బంగారం షాపులో నెక్లెస్... ఇవన్నీ కళ్ల ముందు కనిపించాయి.

ఇక ఆలోచించ లేదు నర్సింహ.

కళ్లు మూసుకుని పెట్టి తెరిచాడు. ఏ బాంబూ పేలలేదు. ఏ విధమైన శబ్ధమూ లేదు.

మెల్లగా కళ్లు విప్పి చూశాడు.

కళ్లు జిగేలుమన్నాయి. పెట్టినిండా... బంగారం బిస్కట్లు...

కంగారుగా తనని ఎవరైనా గమనిస్తున్నారేమోనని చూశాడు. ఎవరూ లేరు.

దూరంగా వెళుతున్న ఓ రిక్షా... ఓ ఆటో... గభాల్న పెట్టెని మూసి సంచిలో వేసుకున్నాడు.

ఎక్కడా లేని భయం... కంగారు...


మెదడు స్తంభించిపోయింది. అక్కడ్నించి త్వరగా జారుకోవాలి. కుండీలోని చెత్తని గబగబ సంచిలో నింపేశాడు! గబగబ అక్కడ్నించి దూరంగా వెళ్లి ఓ గట్టు పైన కూర్చున్నాడు.

పదడుగుల దూరంలో 'టీ' బండి వుంది. ఎదురుగా పడి వున్న సిగరెట్ పీకని తీసి వెలిగించ బోయి ఆ ప్రయత్నాన్ని మానుకున్నాడు. ఇప్పుడు తను కుబేరుడు. ఖరీదైన సిగరెట్టు కాల్చుకోవచ్చు.

ఆ బంగారం బిస్కట్లని అమ్మేసి ఓ బంగళా కట్టాలి.

పెళ్లి చేసుకోవాలి. కారు కొనాలి. ఆలోచనలు రివ్వు రివ్వున పరుగెడుతున్నాయి.

అంతలోనే ఒక్కసారిగా నీరస పడి



పోయాడు నర్సింహ.

ఇవి తను అమ్మడానికి ప్రయత్నిస్తే పోలీసులు పట్టుకుని చితగ్గొడతారు. సొత్తంతా లాక్కుని విషయం బయటికి రాకుండా తనని చంపి ఏ కాలువ లోనో పడేస్తారు.

తనకి సాయపడ్డానికి తెలిసిన వాళ్లెవరూ లేరు.

అదృష్టం కలిసొచ్చింది. దాన్ని కాపాడుకోవడం ఎలా? వాడి మనసు మనసులో లేదు.

ఎదురుగా చంద్రన్న.

''ఏంటిరా అప్పుడే వచ్చావు?''

''నాకు పనేముంటుందయ్యా! తోచక వచ్చి కూర్చున్నాను''

''టీ తాగు'' అన్నాడు.

టీ బండి వాడు ప్లాస్టిక్ గ్లాసులో టీ పోసిచ్చాడు. అది తాగుతూ చంద్రన్న కేసి చూశాడు నర్సింహ.

సిగరెట్ కాలుస్తూ పక్కనే వున్న స్నేహితుడితో కాబోలు మాట్లాడుతున్నాడు చంద్రన్న.

తనకి తెలిసిన మనిషి అతనొక్కడే!

అతనికి విషయం చెప్పి సాయం చెయ్యమంటే?

''అమ్మో ఏమన్నా వుందా?''

''భాగం అడిగితే!''

ప్రస్తుతానికి సొత్తు గురించి చెప్పడం మంచిది కాదనిపించింది. ఆ బంగారాన్ని డబ్బులుగా మార్చడం ఎలాగో వాడికి అర్థం కావడం లేదు.

జేబిరి జుట్టు, పెరిగిన గెడ్డం మీసాలు. మురికి శరీరం, ఒంటిమీద చీకిపోయిన చినిగిన దుస్తులు. చూడ్డానికి తనకి తానే జుగుప్స కలిగేలా వుంటాడు. వంద రూపాయల కాగితాన్ని మార్చడానికే సాహసం చెయ్యలేని జీవితం తనది. అలాంటి తను బంగారాన్ని ఎలా మార్చుకోగలడు?

ముందు తన ఆకారాన్ని మార్చుకోవాలి. అంటే దానిక్కూడా డబ్బులు కావాలి.

మీసాలు, గెడ్డం తీసేయాలి. క్రాపింగ్ చేయించుకో వాలి. మంచి బట్టలు కావాలి. దానికే జనానికి అనుమానం వస్తుంది తన దగ్గర అన్ని డబ్బులెక్కిడివని.

ఊరొదిలిపోతే?

ఏం చేసినా ఇంతసొమ్ముతో ప్రమాదమే. దాన్ని జాగ్రత్త పరచడం పెద్దసమస్యగా కనుపిస్తోంది.

ఓ పక్కభయం... ఎవరికీ తెలీకుండా జాగ్రత్త పడాలి.

తనపైన తనకే జాలి కలుగుతోంది నర్సింహకి.

ఆకలిగా వుంది. దగ్గరగా చూస్తే చేతినిండా బంగారం.

సముద్రం మధ్యలో దాహంతో అల్లాడిపోయిన వాడిలా వుంది వాడి పరిస్థితి.

ఇంతలో రోడ్డు పైన కేకలు...

''నా పర్స్... నా పర్స్....''

అరుస్తున్న వ్యక్తి చుట్టూ జనం... అత నేడుస్తున్నాడు.

''నెల జీతం సార్. బస్సు దిగి చూస్తే పర్స్ లేదు. పిల్లలకి పరీక్ష ఫీజులు కట్టాలి. కుటుంబం గడవాలి. బోలెడన్ని అప్పులు...'' ఏడుస్తూనే చెపుతున్నాడు. తలా ఓ సలహా ఇస్తున్నారు. నర్సింహకి జాలి కలిగింది.

''ఏడవకేడవకు తమ్ముడు! నీకు నేను సాయం చేస్తాను. నీకు నేనున్నాను. నా దగ్గర బోలెడంత సొమ్ముంది. నీకో బంగారు బిస్కట్ ఇస్తాను. బాధ పడకు'' అని చెప్పాలనిపించింది.

కానీ ఆ మాటలు వాడి గొంతులోనే సమాధి అయిపోయినయి.

నెల జీతం అట. కష్టార్జితం. అది పోగొట్టుకుని ఎంత బాధ పడుతున్నాడో?

అతనున్న కష్టంలో అతనికి డబ్బు కావాలి. నెల రోజులు కుటుంబాన్ని పోషించాలి. సాయం చేయగలిగిన స్థితిలో తనున్నాడు. అతనికి బంగారమిచ్చి కొంచెం డబ్బులు పెట్టి మంచి బట్టలు కొనివ్వమని అడగాలి. మరికొన్ని డబ్బులు అడిగి తీసుకుంటే తన పరిస్థితి కూడా మెరుగవుతుంది. అతని వెనకే నడవ సాగాడు.

జనం... ఎటుచూసినా జనం... అతన్ని పలకరించ డానికి బెరుకుగా వుంది. భయంగాను వుంది.

అంతలోనే ఎవరో అతని పక్కన మోటార్ సైకిల్ ఆపారు. అదెక్కి అతను వెళ్లిపోయాడు.

దరిద్రుడు తల కడిగితే వడగళ్ల వాన కురిసిందని సామెత. ఇంత విలువైన సొమ్ముని పోగొట్టుకున్న వాళ్లెంత బాధ పడుతున్నారో! ఎన్ని సంవత్సరాలు కష్టపడితే ఇంత సొత్తవుతోంది.

ఎవరో దొంగిలించి పారిపోడానికి సాధ్యపడక చెత్త కుండీలో పడేసి వుంటారు. ఆ దొంగ వెధవలు ఖచ్చితంగా చెత్తకుండీ దగ్గరకొస్తారు. అక్కడ చెత్త ఏరుకునేది తనే అని పసిగడితే – చంపేస్తారు. వెన్నులోంచి చల్లని వణుకు పుట్టుకొచ్చింది.

దేవుడు కరుణించాడు. వరం ఇచ్చాడు. కానీ ఆ వరం తన పాలిట శాపం అవుతోందనిపిస్తోంది.

ఈ సమస్య నించి బయట పడేదెలా?

ఆ దొంగ వెధవలొచ్చి తనని చంపకముందే ఏదో విధంగా ఆ సొమ్ముని వదిలించుకోవాలి!

అలా అనుకున్న మరుక్షణంలోనే మనసులో ఎంతో బాధ కలిగింది.

ఎన్ని కలలు కన్నాడో? మరెన్ని గాలిమేడలు కట్టుకున్నాడో!

తన బతుకు ఓ చిత్తు కాగితమే! ఏడుపొచ్చింది. కళ్లు తుడుచుకున్నాడు. వెర్రిగా నవ్వుకున్నాడు.

కొన్నిక్షణాల వైరాగ్యం...

తనేం కష్టపడి సంపాదించిన సొత్తుకాదు. ఇది ఎవరో పోగొట్టుకున్నది. దొరికింది కదా అని అట్టి పెట్టుకుంటే అతుకుతుందా?

ఇది తనది కాదు. ఎవరిదో కష్టార్జితం. వాళ్లెవరో తెలీదు. తనకి రోజుకి రెండు మూడు రూపాయలు దొరికితే గడిచిపోతుంది. ఈ సొమ్ము లేక పోయినా తన బతుకు తనకుంది.

కలల్లో తేలిపోతూ, ఊహల్లో బతుకుతూ చల్లని గదులుంటే హోటళ్లలో బస చేయగలడు. పడవ లాంటి కారులో తిరగ్గలడు! పెద్ద బంగళాలో నివసించగలడు. అందమైన అమ్మాయితో కాపురం చేయగలడు.

– కానీ ఇంత సొమ్ము పోగొట్టుకున్న 'మారాజు' అంత ఐశ్వర్యం పోగొట్టుకొని తనలాంటి నీచమైన బతుకు బతగ్గలడా! ఖచ్చితంగా బతకలేడు. ఆత్మ హత్య చేసుకుంటాడు.

నర్సింహలో అంతర్లీనంగా వున్న నిజాయితీ విజృంభిస్తోంది. ఎలాగూ ఈ సొత్తుని సొంతదారుకి చేర్చలేడు. సొమ్ము సద్వినియోగం కావాలి.

ఏ అనాధ శరణాలయానికో అందేలా చేయాలి.

వాళ్లు తనని వాచ్‌మన్‌గా పెట్టుకుని ఇంత అన్నం పెట్టి ఆకలి తీరిస్తే చాలు! శుభ్రమైన బట్టలిస్తే చాలు. ఏ పేదపిల్లనో పెళ్లి చేసుకుంటే తనతో సంసారం... కుటుంబం... అది చాలు.

ఇక ఆలస్యం చేయకూడదు. ఆ ఏరియానించి బయట పడాలి. సంచిని భుజాన వేసుకుని పాతబస్తీ కేసి నడిచాడు.

కృష్ణ ఒడ్డున ఓ పాత బట్ట దొరికింది. ఎవరూ లేని చోట ఓ చెట్టు కింద కూర్చుని పెట్టెలోంచి బంగారు బిస్కట్లని బట్టలో మూట కట్టాడు. పెట్టెని పక్కన పడేశాడు.

ఎదురుగా దీపాల వెలుగులో ఇంద్ర కీలాద్రి.

దుర్గమ్మని మనసులో తలుచుకున్నాడు.

చిత్రంగా అడుగులు అటే పడినయి.

మెట్లు ఎక్కే శక్తి లేదు.

''తల్లీ, శక్తిని ప్రసాదించు'' మనసులోనే అమ్మని ప్రార్థించేడు.

చిత్తుకాగితాల సంచిని మెట్ల పక్కన పడేసి పాతబట్టలో కట్టిన సొత్తుతో శక్తిని కూడదీసుకుని అమ్మ సాన్నిధ్యంలోకి చేరుకున్నాడు.

ఎక్కడా లేని ధైర్యం!

ఏ అనాధ ఆశ్రమానికో ఇవ్వాలనుకున్న ఆ సొమ్ముని దుర్గమ్మకి నమస్కరించి హుండీలో వేసేశాడు.

ఇప్పుడు నర్సింహ మనసు తేలిక పడింది. ఆకలి పటాపంచలైంది.

రెట్టింపు ఉత్సాహంతో కిందికి దిగేశాడు నర్సింహ.

వెనక్కి తిరిగి కొండకేసి చూస్తూ రెండు చేతులూ జోడించాడు.

తేలికపడిన మనసులో ఎప్పట్లానే చిత్తుకాగితాల సంచిని భుజాన వేసుకుని నడక సాగించాడు నర్సింహ.

★

చందు సోంబాబు
92471 79249
96428 53474

